# పాడి పశువుల కోసం సబ్సిడీపై గడ్డి విత్తనాలు


అడ్లూర్ ఎల్లారెడ్డిలో పెంచుతున్న గడ్డిని పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి సింహారావు


పాలశీతలీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారి

- జిల్లా పశువైద్యాధికారి సింహారావు
- అడ్లూర్ ఎల్లారెడ్డిలో గడ్డిరకాల సాగు, పాల శీతలీకరణ కేంద్రం పరిశీలన

సదాశివనగర్, డిసెంబర్ 12: జిల్లాలోని పాడి పశువుల కోసం రైతులకు విజయ డెయిరీ ఆధ్వర్యంలో గడ్డి జాతుల విత్తనాలను సబ్సిడీపై అందిస్తూ.. అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా పశువైద్యాధికారి సింహారావు తెలిపారు. మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో విజయ డెయిరీ(బీఎంసీ) ఆధ్వర్యంలో పెంచుతున్న గడ్డి జాతులు, బీఎంసీ పాల శీతలీకరణ, రైతు పైడి జ్యోతి చిన్నయ్య పెంచుతున్న పశువులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సింహారావు మాట్లాడుతూ.. పాడి రైతుల కోసం ప్రభుత్వం, విజయ డెయిరీ ఆధ్వర్యంలో గడ్డి విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నదని తెలిపారు. పాడి రైతుల కోసం విజయ డెయిరీ బీఎంసీలో గడ్డి జాతులను పెంచుతున్నట్లు వివరించారు. పాడి రైతులు గడ్డి జాతుల మొక్కలను ఎలా పెంచాలనే అంశాలను డెయిరీ సిబ్బంది వివరిస్తూ, ప్రోత్సహిస్తున్నారని అన్నారు. పైడి జ్యోతి చిన్నయ్య అనే మహిళా రైతు కుటుంబ సభ్యులతో కలిసి పది ఆవులు, పది బర్రెలను పెంచుతూ ఆదర్శంగా నిలుస్తున్నదని తెలిపారు. పాల ఉత్పత్తిలో జిల్లాలోనే ఆమె ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. విజయ డెయిరీ, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఉచిత పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు పాడి పశువులను పెంచుతూ ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. మేలు జాతి పశువులను పెంచి అధికంగా పాల ఉత్పత్తులను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏడీ సంజీవ్ కుమార్, అడ్లూర్ ఎల్లారెడ్డి విజయ డెయిరీ అధ్యక్షురాలు దుబ్బాక భాగ్యా నర్సారెడ్డి, బీఎంసీ మేనేజర్ యాడారం రమేశ్ చారి, సర్పంచ్ పైడి జానకీ జనార్దన్ యాదవ్, పాడి రైతులు పైడి జ్యోతీ చిన్నయ్య, సంకరి వెంకట్ రాములు, పైడి రమేశ్, మాసిరెడ్డి శివారెడ్డి, కొండి ప్రతాప్ రెడ్డి, ఎండ్రియాల శ్రీనివాస్ గౌడ్, డెయిరీ సిబ్బంది వడ్ల రాములు, మంగలి రాములు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

గాంధారి, డిసెంబర్ 12: మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సతీశ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ రాధాబలరాం అధ్యక్షతన మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరుకావాలని తెలిపారు. సమావేశంలో మండలంలోని ఆయా గ్రామాల్లో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులతోపాటు, సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అధికారులు పూర్తి వివరాలతో హాజరు కావాలని తెలిపారు.

## మను బ్రహ్మ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


మనుబ్రహ్మ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

గాంధారి, డిసెంబర్ 12: మండల కేంద్రంలోని మనుబ్రహ్మ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని మనుబ్రహ్మ సంఘంలో సమావేశమైన సంఘ సభ్యులు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా కమ్మరి సాయులు, ఉపాధ్యక్షుడిగా కమ్మరి నాగరాజు, కార్యదర్శిగా కమ్మరి సురేశ్, కోశాధికారిగా నాగభూషణం, గౌరవ అధ్యక్షులుగా కమ్మరి బాలరాజు, కమ్మరి రాములు ఎన్నికయ్యారని తెలిపారు. కమ్మరి స్వామి, హన్మాండ్లు, సంజీవులు, సాయిలు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా మొరం తరలిస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న నరేశ్

పిట్లం, డిసెంబర్ 12: ప్రభుత్వ అనుమతి లేకుండా మొరం తరలిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని నాయబ్ తహసీల్దార్ నరేశ్ అన్నారు. ఆయన మంగళవారం తహసీల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండలకేంద్రంలో మొరం తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పట్టుకొని రూ.మూడు వేల జరిమానా విధించామన్నారు. మండలంలో ఎవరైనా మొరం తరలించాలనుకుంటే తహసీల్ కార్యాలయంలో అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

## మహా పడిపూజకు రావాలని ఆహ్వానం


ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న మాలధారులు

పిట్లం, డిసెంబర్ 12: మండలకేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 16న అయ్యప్పస్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం అయ్యప్పస్వామి సేవాసమితి సభ్యులు మండలకేంద్రంలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావుకు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు భగవాన్, బొడ్లరాజు, వెంకట్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, సాయిప్రసాద్, గురునాథ్ తదితరులున్నారు.

## హనుమాన్ ఆలయంలో యజ్ఞం


యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

పిట్లం, డిసెంబర్ 12: మండలంలోని పోతిరెడ్డిపల్లి హనుమాన్ ఆలయంలో మంగళవారం అమావాస్యను పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అమావాస్య యజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు తేజస్వామి, భక్తులు బెజుగం జగదీశ్, పడిగెల సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు అయ్యప్ప ఆలయ తొమ్మిదో వార్షికోత్సవం


ఉత్సవాల కోసం ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ బాధ్యులు

గాంధారి, డిసెంబర్ 12: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి రంగులు వేసి, పూలతో అందంగా అలంకరించారు. బుధవారం నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా మహాపడి పూజ, శాంతిపాఠం, గణపతి పూజ, పుణ్యాహ వాచనం, మాతృక పూజ, రక్ష బంధనం, పంచగవ్య ప్రాశనం, ఋుత్విక్ వరణం, యాగశాల ప్రవేశనం, యాగశాల సంస్కారం, అఖండ దీపారాధన, బ్రహ్మాది దేవత చతుష్షష్టి మోగిని తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వాస్తు, క్షేత్రపాలక మండప స్థానం, స్థాపిత దేవత షోడశోపచార పూజ, అగ్ని ప్రతిష్ఠ, గణపతి పంచసూక్త హోమం, రుద్ర స్వాహాకార బలి ప్రదానం, పూర్ణాహుతి, మంగళ హారతి, మంత్ర పుష్పం, మహదాశీర్వచనం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప సేవా సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి, నాచారం పీఠాధిపతి మధుసూదానంద స్వామి, గురుస్వామి చంద్రశేఖర శర్మ హాజరవుతారని పేర్కొన్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని అయ్యప్ప సేవా సమితి సభ్యులు కోరారు.

## మాలధారులకు భిక్ష

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 12: ఎల్లారెడ్డి పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో దీక్షాధారులకు కౌన్సిలర్ పద్మ శ్రీకాంత్ మంగళవారం భిక్ష ఏర్పాటు చేశారు. అయ్యప్పస్వామికి పూజలు చేసి స్వామి వారికి మహానైవేద్యం సమర్పించారు. అనంతరం దీక్షాధారులకు భిక్ష పెట్టారు. కార్యక్రమంలో దీక్షాధారులు ఉక్కల్‌కర్ రాజేందర్‌నాథ్, శ్రీనివాస్‌గౌడ్, మురళి, వంగపల్లి కాశీనాథ్, నల్లవాగు వెంకటేశం, శ్రీకాంత్ రెడ్డి, జక్కుల యాదగిరి, కేటీఎస్ శేఖర్, గోజె అమృత్‌రావు, సంగాగౌడ్, పతంగి రాజ్‌కుమార్, ప్యాలాల రాములు తదితరులు పాల్గొన్నారు.


భిక్షలో పాల్గొన్న మాలధారులు

## తమను ఆదుకోవాలని ఆటోవాలాల ఆందోళన


ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఆటోవాలాలు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 12: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో తమ బతుకులు రోడ్డున పడుతున్నాయని ఎల్లారెడ్డిలోని ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ వారు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో తమ జీవనభృతి దెబ్బతింటున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆటోలపై వచ్చే ఆదాయంతోనే తమ కుటుంబ పోషణ సాధ్యమని, ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నదని అన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆటో డ్రైవర్ యూనియన్ సభ్యులు ఉన్నారు.

*మద్నూర్‌లో ఆటోడ్రైవర్ల నిరసన..*

మద్నూర్, డిసెంబర్12: బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంపై ఆటోడ్రైవర్లు ఆందోళన చేపట్టారు. మండలకేంద్రంలోని పాతబస్టాండ్ వద్ద మంగళవారం కూర్చొని నిరసన తెలిపారు. అనంతరం తహసీల్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఫైనాన్స్ డబ్బులు చెల్లించడం, ఇంటి కిరాయి, పిల్లల చదువులపై తీవ్ర ప్రభావం చుపుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమకు ఉపాధి కల్పించి, న్యాయం చేయాలని కోరారు.

### జాతీయ స్థాయి

## ఖో-ఖో పోటీలకు ఎంపిక


సరోజ

ఎల్లారెడ్డి, డిసెంబర్ 12: ఎల్లారెడ్డి పట్టణం పరిధిలోని గండి మాసానిపేట ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని అజ్మీరా సరోజ జాతీయ స్థాయిలో అండర్ -14 ఖో ఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మహమ్మద్ అతీఖుల్లా తెలిపారు. తుప్రాన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఖోఖో చాంపియన్ షిప్ పోటీలో ఉత్తమ ప్రతిభ చూపినందుకు ఆమెను నేటి(బుధవారం) నుంచి కర్ణాటకలోని తుమకూరు జిల్లాలో జరుగనున్న జాతీయ స్థాయి సబ్ జూనియర్ పోటీలకు ఎంపిక చేశారని చెప్పారు. ఖమ్మంలో పది రోజుల పాటు ప్రత్యేకంగా నిర్వహించిన క్యాంపులో ఆమె ప్రతిభ చూపిందని తెలిపారు. సరోజకు ప్రత్యేక శిక్షణ అందించిన అతీఖుల్లాను ఎల్లారెడ్డి మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ సుజాతమ్మ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థిని సరోజను సోమర్యాగడి తండా సర్పంచ్ లచ్చానాయక్ అభినందించారు. గ్రామానికి మరింత పేరు తేవాలని ఆయనతో పాటు ఉప సర్పంచ్ ధన్‌సింగ్, ఎంపీటీసీ లక్ష్మీ శ్రీను, ఎస్ఎంఆర్పీ యువజన సంఘం అధ్యక్షుడు రాకేశ్ నాయక్ తదితరులు ఆకాంక్షించారు.